రాజస్థాన్ బోణీ

చెన్నైకి రెండో పరాజయం

రాణా (81)

గువహతి: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ బోణీ కొట్టింది. తొలి రెండు మ్యాచ్‌లలో పరాభవాలు ఎదుర్కున్న ఆ జట్టు.. చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం చివరిబంతి వరకూ ఉత్కంఠగా జరిగిన పోరులో 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. నితీశ్ రాణా (36 బంతుల్లో 81, 10 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ రియాన్ పరాగ్ (28 బంతుల్లో 37, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (2/28), పతిరాన (2/28), ఖలీల్ అహ్మద్ (2/38) రాజస్థాన్‌ను కట్టడి చేశారు. అనంతరం ఛేదనలో చెన్నై.. 20 ఓవర్లలో 176/6 వద్దే ఆగిపోయింది. రుతురాజ్ గైక్వాడ్ (44 బంతుల్లో 63, 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (22 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) పోరాడినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. హసరంగ (4/35) కీలక వికెట్లు పడగొట్టగా జోఫ్రా ఆర్చర్ (1/13) కట్టుదిట్టంగా బంతులేసి చెన్నైని ఆరంభంలోనే దెబ్బకొట్టాడు.

రాణా వీరబాదుడు

ఖలీల్ తొలి ఓవర్లో మూడో బంతికే జైస్వాల్ (4)ను ఔట్ చేసి చెన్నైకి తొలి బ్రేక్ ఇచ్చాడు. కానీ ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు ఆడుతున్న రాణా.. ఆరంభం నుంచే సీఎస్‌కే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. బౌలర్ ఎవరన్నదీ లెక్కచేయకుండా అతడు వీరబాదుడు బాదాడు. ఓవర్టన్ 4వ ఓవర్లో 16, అశ్విన్ ఐదో ఓవర్లో 19 పరుగులు పిండుకున్న అతడు 21 బంతుల్లోనే అర్ధ సెంచరీని అందుకున్నాడు. శాంసన్ (20) విఫలమైనా పరాగ్‌తో కలిసి మూడో వికెట్‌కు 38 పరుగులు జోడించిన అతడు క్రీజులో ఉన్నంతసేపు చెన్నై బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించాడు. కానీ అశ్విన్ వేసిన 12వ ఓవర్లో బంతిని ముందుకొచ్చి ఆడబోయిన రాణాను ధోనీ స్టంపౌట్ చేయడంతో అతడి కథ ముగిసింది. ఆఖర్లో హెట్‌మెయర్ (19) మెరుపులు మెరిపించాడు.

సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 182/9 (రాణా 81, పరాగ్ 37, నూర్ 2/28, పతిరాన 2/28); **చెన్నై:** 176/6 (రుతురాజ్ 63, జడేజా 32, హసరంగ 4/35, ఆర్చర్ 1/13)

తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: 26వ సబ్ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు కాంస్యంతో సత్తాచాటింది. ఒడిషాలోని కటక్‌లో మార్చి 27-30 మధ్య జరిగిన ఈ పోటీలలో భాగంగా జి. గంగోత్రి, ఇ. చరిత శ్రీ, ఏ. భక్తి యాదవ్, జే. మన స్విత కూడిన తెలంగాణ ఎపీ జట్టు కాంస్యం గెలుచుకుంది.

పునియాకు రజతం

అమ్మాన్: ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు దీపక్ పునియా, ఉదిత్ రజతాలతో మెరిశారు. పురుషుల ఫ్రీస్టయిల్ పోటీలలో భాగంగా ఆదివారం జరిగిన 92 కిలోల విభాగంలో బరిలోకి దిగిన పునియా.. ఫైనల్‌లో 0-10తో ఇరాన్ రెజ్లర్ అమీర్ హోసేన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో ఫైనల్‌లో ఉదిత్ (61 కిలోలు) 4-6తో సుడా టకర చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకున్నాడు.

ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన క్యాపిటల్స్

ఢిల్లీ ధమాకా

సన్‌రైజర్స్‌కు రెండో ఓటమి • స్టార్క్ ఫైఫర్‌కు ఎస్ఆర్‌హెచ్ కుదేలు

ఐపీఎల్ తాజా సీజన్‌ను భారీ విజయంతో ఆరంభించిన సన్‌రైజర్స్ ఆ తర్వాత గాడి తప్పతున్నది. లక్నోతో సొంత మైదానంలో జరిగిన మ్యాచ్‌తో పాటు ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆదివారం ముగిసిన పోరులోనూ బ్యాటింగ్ వైఫల్యంతో వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. గత సీజన్ ప్లేఆఫ్స్‌లో సన్‌రైజర్స్ ఓటములకు కారకుడైన పేసర్ మిచెల్ స్టార్క్ మరోసారి హైదరాబాద్‌ను దెబ్బకొట్టాడు. బంతితో పాటు బ్యాట్‌తోనూ చెలరేగిన ఢిల్లీ.. వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది.

విశాఖపట్నం: కొత్త కెప్టెన్ అక్షర్ పటేల్ సారథ్యంలో ఐపీఎల్-18 ఆడుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. తొలి మ్యాచ్‌లో లక్నోపై ఉత్కంఠ విజయాన్ని అందుకున్న ఆ జట్టు.. మలిపోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)పై ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మిచెల్ స్టార్క్ (5/35) పేస్ దెబ్బకొట్టగా కుల్‌దీప్ యాదవ్ (3/22) స్పిన్ మాయకు హైదరాబాద్ 18.4 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అనికేత్ వర్మ (41 బంతుల్లో 74, 5 ఫోర్లు, 6 సిక్సర్లు), హెన్రిచ్ క్లాసెన్ (19 బంతుల్లో 32, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఎస్ఆర్‌హెచ్‌ను ఆదుకున్నారు. ఫాఫ్ డుప్లెసిస్ (27 బంతుల్లో 50, 3 ఫోర్లు, 3 సిక్సర్లు), జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ (32 బంతుల్లో 38, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) దంచడంతో క్యాపిటల్స్ మరో 4 ఓవర్లు మిగిలుండగానే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ఓపెనర్లే దంచారు

స్వల్ప ఛేదనలో ఢిల్లీ ఓపెనర్లు డుప్లెసిస్, మెక్‌గర్క్ సగం లక్ష్యాన్ని 9 ఓవర్లలోనే దంచేశారు. షమీ మూడో ఓవర్లో 6, 4తో బాదుడుకు శ్రీకారం చుట్టిన డుప్లెసిస్. క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడాడు. మెక్‌గర్క్ అతడికి చక్కని సహకారం అందించాడు. దీంతో పవర్ ప్లే ముగిసేసరికే ఢిల్లీ వికెట్ నష్టపోకుండా 52 రన్స్ చేసింది. కమిన్స్ 7 ఓవర్లో 4, 6తో రెచ్చిపోయిన డుప్లెసిస్ హర్షల్ 9వ ఓవర్లో సింగిల్ తీసి 26 బంతుల్లోనే అర్ధసెంచరీని పూర్తిచేశాడు.

స్టార్క్ 5/35

స్టార్క్ పేస్‌కు విలవిల

లక్నో మ్యాచ్‌లో మాదిరిగానే ఢిల్లీతోనూ సన్‌రైజర్స్ టాపార్డర్ ఘోరంగా విఫలమైంది. అభిషేక్ (1) తొలి ఓవర్లోనే రనౌట్ అయి మరోసారి నిరాశపరిచాడు. తన రెండో ఓవర్లో స్టార్క్.. ఇషాన్ కిషన్ (2)తో పాటు 'లోకల్ బాయ్' నితీశ్ కుమార్ రెడ్డి (0)నీ ఔట్ చేసి ఎస్ఆర్‌హెచ్‌కు డబుల్ షాకులిచ్చాడు. తన తర్వాతి ఓవర్లో ట్రావిస్ హెడ్ (12 బంతుల్లో 22, 4 ఫోర్లు)నూ పెవిలియన్‌కు పంపి రైజర్స్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు.

2 **ఢిల్లీ క్యాపిటల్స్ చరిత్రలో ఒక బౌలర్ ఐదు వికెట్లు తీయడం ఇది రెండోసారి కాగా 17 ఏండ్లలో ఇదే ప్రథమం. 2008లో ఆ జట్టు స్పిన్నర్ అమిత్ మిశ్రా (5/17) డెక్కన్ ఛార్జర్స్‌పై ఫైఫర్ నమోదుచేశాడు.**

అరంగేట్ర స్పిన్నర్ జీషన్ అన్సారీ ఒకే ఓవర్లో ఓపెనర్లను ఔట్ చేసినా ఢిల్లీ పెద్దగా ఇబ్బందిపడలేదు. కేఎల్ రాహుల్ (15)నిరాశ పరిచినా పొరెల్ (18 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), స్టబ్స్ (21 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు.

అనికేత్ ఒక్కడే..

అనికేత్ (74)

హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో అనికేత్ ఇన్నింగ్సే హైలైట్. 37 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్.. ఆ మాత్రం స్కోరైనా చేయగలిగిందంటే అది అనికేత్ వల్లే. క్లాసెన్ అండతో అతడు మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. విప్రాజ్ నిగమ్ 7వ ఓవర్లో 4,6తో పరుగుల వేట మొదలెట్టిన అనికేత్.. మరుసటి ఓవర్లో అక్షర్‌నూ రెండు సిక్సర్లతో అరుసుకున్నాడు. మరో ఎండ్‌లో క్లాసెన్ కూడా వేగంగా ఆడాడు. కానీ కుదురుకుంటున్న దశలో మోహిత్ శర్మ 11వ ఓవర్లో క్లాసెన్‌ను ఔట్ చేయడంతో ఎస్ఆర్‌హెచ్ మళ్లీ కష్టాల్లో పడింది. కుల్‌దీప్.. వరుస ఓవర్లలో అభినవ్ (4), కమిన్స్ (2) ను ఔట్ చేశాడు. 36 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదుచేసిన అనికేత్.. అక్షర్ 15వ ఓవర్లో 4, 6, 6తో రెచ్చిపోయాడు. కానీ తర్వాత ఓవర్ వేసిన కుల్‌దీప్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన అతడు.. బౌండరీ లైన్ వద్ద మెక్‌గర్క్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 18.4 ఓవర్లలో 163 ఆలౌట్ (అనికేత్ 74, క్లాసెన్ 32, స్టార్క్ 5/35, కుల్‌దీప్ 3/22); **ఢిల్లీ:** 16 ఓవర్లలో 166/3 (డుప్లెసిస్ 50, మెక్‌గర్క్ 38, అన్సారీ 3/42)

అక్టోబర్‌లో ఆస్ట్రేలియాకు భారత్

ఇరు జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20లు

మెల్‌బోర్న్: ఐపీఎల్ మూడ్‌లో ఉన్న భారత క్రికెట్ అభిమానులకు మరో శుభవార్త. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ (టీ20) తర్వాత భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. అక్కడ టీమ్‌ఇండియా ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా 2025-26కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 19 నుంచి మొదలుకాబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ 23న ముగియనుంది. వన్డే సిరీస్ ముగిసిన తర్వాత నాలుగు రోజులకు ధనాధన్ క్రికెట్ మజా మొదలవుతుంది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 08 దాకా ఐదు టీ20లను నిర్వహించనున్నారు. మూడు వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లు కాగా టీ20 సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు రాత్రే జరుగుతాయి.

అమ్మాయిల ఆల్ ఫార్మాట్ సిరీస్:

పురుషులతో పాటు భారత మహిళల జట్టు సైతం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. 2026 ఫిబ్రవరి-మార్చిలో భారత్..ఆసీస్‌తో 3 టీ20లు, 3 వన్డేలు, ఒక టెస్టు ఆడనుంది. ఫిబ్రవరి 15-21 మధ్య టీ20 సిరీస్ జరగాల్సి ఉండగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 01 దాకా వన్డే సిరీస్ జరుగనుంది. మార్చి 6 నుంచి పెర్త్‌లోని వాకా మైదానంలో ఏకైక టెస్టు (పింక్) ఆతిథ్యమివ్వనుంది.

హెచ్‌సీఏ X ఎస్ఆర్‌హెచ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తమను బెదిరిస్తున్నదని, ఈ విషయంలో బీసీసీఐ తక్షణమే జోక్యం చేసుకోకుంటే తాము హైదరాబాద్‌ను వదిలివెళ్తామని సన్‌రైజర్స్ విడుదల చేసిన ఈ-మెయిల్ తీవ్ర దుమారం రేపుతోంది. ఈ విషయంపై హెచ్‌సీఏ స్పందించింది. అసలు తమకు ఎస్ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి ఈ-మెయిల్ రాలేదని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కార్పొరేట్ బాక్సుల టికెట్ల విషయంలో మొదలైన రగడపై అటు ఎస్ఆర్‌హెచ్, ఇటు హెచ్‌సీఏ ఢీ అంటే ఢీ అనుకుంటున్నాయి. ఒప్పందం ప్రకారం ఉప్పల్ స్టేడియంలోని మొత్తం సీటింగ్ కెపాసిటీలో 10 శాతం (3,900 సీట్లు) హెచ్‌సీఏకు సన్‌రైజర్స్ ఇవ్వాల్సి ఉంది. కాగా ప్రధానంగా స్టేడియం దక్షిణ భాగంలోని మొదటి అంతస్తులో గల ఎఫ్-12ఏ బాక్సులో కాంప్లిమెంటరీ పాసుల దగ్గరే ఇరువర్గాలు ఏకాభిప్రాయం కుదరడం లేదని వినికిడి. అసలు హెచ్‌సీఏకు ఇచ్చేవి కాకుండా ఎస్ఆర్‌హెచ్ ఎన్ని టికెట్లను ముద్రిస్తుంది? ఎన్నింటిని అమ్మకానికి పెడుతుంది? అనేదానిపైనా లెక్కాపత్రం లేదని తెలుస్తోంది. అదీగాక మ్యాచ్ టికెట్ ధరలనూ డిమాండ్ బట్టి ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో విధంగా నిర్ణయించడం, అటు హెచ్‌సీఏ, ఇటు ఎస్ఆర్‌హెచ్ సోషల్ మీడియా ఖాతాల్లోనూ టికెట్ ధరలపై సమాచారం లేకపోవడం సోషల్ మీడియాలో అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. కొన్ని స్టాండ్లలో సామర్థ్యానికి మించి టికెట్లను విక్రయిస్తున్నారని, దీంతో టికెట్లు కొనుగోలు చేసి లోపలికి వెళ్లినవారికి అక్కడ వేరే వాళ్లు ఉండటంతో నిలబడి మ్యాచ్ చూడాల్సి వస్తుందని ఎస్ఆర్‌హెచ్‌పై ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా హెచ్‌సీఏ-ఎస్ఆర్‌హెచ్ మధ్య మొదలైన కాంప్లిమెంటరీ పాసుల వివాదం ఎటు దారితీస్తుందనేది చర్చనీయాంశమైంది.

మియామి క్వీన్ సబలెంక

ఫ్లోరిడా: ప్రస్తుత మహిళల టెన్నిస్‌లో ఒకటో సీడ్‌గా ఉన్న అరీనా సబలెంక తన కీర్తికిరీటంలో మరో టైటిల్‌ను జమచేసుకుంది. 'హార్డ్‌కోర్ట్ క్వీన్'గా గుర్తింపు పొందిన ఈ బెలారస్ అమ్మాయి.. ఫ్లోరిడాలో జరుగుతున్న మియామి ఓపెన్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో సబలెంక.. 7-5, 6-2తో నాలుగో సీడ్ జెస్సికా పెగుల (అమెరికా)ను వరుస సెట్లలో చిత్తుచేసి తన కెరీర్‌లో 19వ టైటిల్‌ను గెలుచుకుంది. పురుషుల ఫైనల్ జొకోవిచ్-మెన్సిక్ మధ్య జరుగనుంది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
బెంగళూరు	2	2	0	4	2.26
ఢిల్లీ	2	2	0	4	1.32
లక్నో	2	1	1	2	0.96
గుజరాత్	2	1	1	2	0.62
పంజాబ్	1	1	0	2	0.55
కోల్‌కతా	2	1	1	2	-0.30
చెన్నై	3	1	2	2	-0.77
హైదరాబాద్	3	1	2	2	-0.87
రాజస్థాన్	3	1	2	2	-1.11
ముంబై	2	0	2	0	-1.16

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.